గదిలోని ఆ తొమ్మిది మందిలో ఎవరు గుర్తించగలరు?" నవ్వుతూ ప్రశ్నించాడు గురువు తన శిష్యుడ్ని.

"మేలుకుని ఉన్న ఇద్దరూ ఆ సంగతి గుర్తించగలరు." చెప్పాడు శిష్యుడు.

"నిద్రపోతున్న వాళ్ళకి ఎవరు మేలుకుని ఉన్నారో తెలుస్తుందా?"

"తెలీదు స్వామీ. మేలుకుని ఉన్న వారికే ఎవరు నిద్ర పోతున్నారో, ఎవరు మేలుకుని ఉన్నారో తెలుస్తుంది."

"అజ్ఞానం లోంచి మేలుకున్న ఓ జ్ఞానిని ఇంకో జ్ఞాని గుర్తించగలగడం కూడా సరిగ్గా ఇలాగే జరుగుతుంది." వివరించాడు గురువు.

## 47. స్వర్గపు భోజనం

ఓ ధనవంతుడు బీదలకి అన్నదానం చేసి కీర్తి గడించాలనుకుని ఓ అన్నదాన సత్రాన్ని ప్రారంభించాడు. ముక్కి పోయి, పురుగులు పట్టి చవకగా దొరికే బియ్యాన్ని కొని అతను యాత్రికులకి అన్నం పెట్టేవాడు. ఆయన లోభ గుణాన్ని చూసిన అతని కూతురు నొచ్చుకునేది.

ఓ రోజు ఆమె తల్లి తీర్థయాత్రలకి వెళ్ళగానే ఇంటి వంట బాధ్యత ఆమె మీద పడింది. సత్రం నించి తెప్పించిన పురుగుల బియ్యంతో అన్నం వండి తండ్రికి వడ్డించింది. దాన్ని నోట్లో పెట్టుకోగానే ఎలాంటి బియ్యంతో కూతురు అన్నం వండిందో తండ్రికి అర్థమైపోయింది. కంచాన్ని పక్కకి తోసేస్తూ ఆశ్చర్యంగా అడిగాడు ఆయన.

"ఈ బియ్యం ఎక్కడివి నీకు?"

"మన సత్రం నించి మీకోసం ప్రత్యేకంగా తెప్పించి వండాను నాన్నగారు." జవాబు చెప్పింది కూతురు.

"అదేమిటి? ఇంట్లో మంచి బియ్యం వుండగా సత్రం నించి దేనికి ఈ ముక్క బియ్యాన్ని తెప్పించావు? నేను ఈ పురుగులన్నం ఎలా తింటాననుకున్నావు?" మండి పడ్డాడు తండ్రి.

"మీరు చేసే అన్నదానం వల్ల మీరు స్వర్గానికి వెళ్ళడం తప్పదు కదా. మీరు భూమి మీద ఎలాంటి భోజనం దానం చేస్తున్నారో, అక్కడ మీకు కూడా సరిగ్గా అలాంటి భోజనమే పెడతారు. అందుకని ఇప్పటి నించే మీకు అది తినడం అలవాటైతే ఇబ్బంది పడరని సత్రం నించి ప్రత్యేకంగా మీకోసం బియ్యాన్ని తెప్పించి వండాను." చెప్పిందామె.

తండ్రికి తను చేసే తప్పు బోధపడింది. అప్పటి నించి సత్రానికి స్వచ్ఛమైన బియ్యాన్ని పంపసాగాడు.

## 48. భయం

నౌకా యానం అంటే ఇష్టం ఉన్న ఓ రాజు ఓ సారి తన దగ్గర కొత్తగా చేరిన ఓ విదూషకుడ్ని తన వెంట నౌకలో పౌర్ణమికి విహారానికి తీసుకువెళ్ళాడు. ఆ విదూషకుడు ఎన్నడూ సముద్రాన్ని చూసినవాడు కాదు. దాంతో కొద్ది దూరం వెళ్ళాక అతను భయంతో ఓ గదిలో కూర్చుని గట్టిగా రోదంచసాగాడు. అంతా అతన్ని శాంత పరచడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. ఓడ ప్రయాణం ప్రమాదకరం కాదు అని ఎంతమంది నచ్చచెప్ప ప్రయత్నించినా అతను ఏడుపుని మానలేదు. అతని ఏడుపు స్థాయి ఎంత పెద్దగా ఉందంటే ఎవరూ దాన్ని విని భరించలేకపోయారు. దాంతో రాజు నౌకని వెనక్కి తిప్పమని చెప్పాడు.

అది విన్న మంత్రి రాజుతో చెప్పాడు.

"రాజా! మీరు అనుమతిస్తే అతని ఏడుపుని ఆపే ఆఖరి ప్రయత్నాన్ని చేస్తాను."

"సరే." అనుమతిని ఇచ్చాడు రాజు.

మంత్రి సైనికులని పిలిచి ఏం చెయ్యాలో చెప్పాడు. ఆ ప్రకారం సైనికులు ఆ విదూషకుడ్ని పట్టుకెళ్ళి సముద్రంలోకి విసిరేసారు. నీళ్ళల్లో పడ్డ అతను కాళ్ళు చేతులు కొట్టుకుంటూ, నీళ్ళల్లో మునిగి మళ్ళీ పైకి వస్తూ, సముద్రపు ఉప్పు నీటిని తాగుతూ చావు భయంతో ఇంకా పెద్దగా అరవసాగాడు. అతను ఇంకోసారి తేలగానే సైనికులు అతన్ని నీళ్ళల్లోంచి తీసి, తిరిగి ఓడలోకి తీసుకువచ్చారు. ఆ